



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

కన్నీటి కష్టాలు తీరేనా..?

- నాలుగు రోజులకోసారి తాగునీరు - వంతు తప్పితే ఎనిమిది రోజులకోసారి
- పూర్తయినా ప్రారంభానికి నోచని రక్షిత మంచినీటి ట్యాంకు
- పునరుద్ధరణకు నోచని సొంత పైపులైను - 30 ఏళ్లుగా వీడని నీటి కష్టాలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

జిల్లా కేంద్రానికి పట్టుమని పది కిలోమీటర్లే... తుంగభద్ర నదికి కేవలం ఐదు కిలోమీటర్ల సమీప దూరం. మేజర్ గ్రామపంచాయతీ హోదా... పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. గ్రామానికి అంత పెద్ద నీటి వనరులు అందుబాటులో ఉన్నా తాగునీటి అవసరాలు తీరని పరిస్థితి. ఇక్కడ ఏ ఇంటి గడపను తొక్కినా తాగునీటి సమస్యలు, కన్నీటి గాథలు కథలు కథలుగా వినిపిస్తున్నాయి. ఇక్కడ తాగునీటి కోసం ప్రజలు పడే అవస్థలు ఎన్నో? పాలకులు మారినా గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాల వ్యథలు ఏమాత్రం తీరడం లేదు. ఇది కర్నూలు రూరల్ మండలం, మేజర్ గ్రామపంచాయతీ అయిన ఉల్చాల దుస్థితి.

కర్నూలు మండలం లోని ఉల్చాల గ్రామంలో సుమారు 10 వేల జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామానికి తుంగభద్రా నది కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రవహిస్తోంది. సుమారు దశాబ్దాల కాలం నాడు నాటి జనాభా అవసరాలకు అనుగుణంగా గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు గతంలో నాగులదన్నకుంట, రేమట రోడ్డులో కుమ్మరిపాట్ వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించి గతంలో నీరందిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. తొలిసారి గ్రామానికి తాగునీటి సరఫరా కోసం ఏర్పాటుచేసిన నాగులుదిన్నకుంట ఓవర్ హెడ్ ట్యాంకు సాంకేతికంగా లోపాలు ఉండడంతో పూర్తిగా వినియోగంలో లేకుండా పోయింది. జనాభాకు మంచినీటి అవసరాలు పెరగడంతో బిసి కాలనీలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను నిర్మించి నీటిని సరఫరా చేస్తున్నారు. ఎస్‌సి కాలనీలో మరో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకును నిర్మించారు. చిన్న చిన్న పనులు తప్ప దాదాపు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పైపులైను బిగించకపోవడంతో గ్రామంలో దిష్టిబొమ్మలా నిరుపయోగంగా దర్శనమిస్తోంది.

సొంత పైపులైను కరువు : గ్రామంలో తాగునీటిని సరఫరా చేసేందుకు సొంత పైపులైను కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం భావాపురం వద్ద నుంచి ఉలిందకొండ మీదుగా వెల్దుర్తి వరకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పైపులైన్ మీద ఆధారపడి నీటిని వినియోగిస్తున్నారు. గ్రామ తాగునీటి అవసరాల కోసం ఆ పైప్‌లైన్ అధికారుల దయ మీద ఆధారపడి తాగు నీరు వినియోగించుకోవలసి వస్తోంది. ప్రస్తుతం రోజు మార్చి రోజు నీటిని వీధులకు నీరు వదులుతున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజులకోసారి ఒక్కోవీధికి వంతు వస్తోంది. దురదృష్టవశాత్తు వంతు వచ్చిన రోజు ఏదైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఆ వీధికి తిరిగి ఎనిమిది రోజుల వరకు తాగునీటి కోసం వేచి చూడాల్సిన దుస్థితి. ప్రధానంగా గ్రామంలో ఉప్పర, వీధి, ముస్లిం ఏరియా బిల్డింగ్స్, సచివాలయం వెనుక ప్రాంతం కుమ్మరి వీధి, మసీదు గిరి, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఆ వచ్చే నీరు సైతం పరిశుభ్రంగా ఉండడం లేదు. నీళ్ల పచ్చ రంగులో మారి వస్తున్నాయి. నీళ్ల పాత్రల్లో వండ్రు మట్టి అడుగుభాగాన పేరుకుంటోంది. ఈ నీటిని తాగాలన్నా కూడా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొంతమంది పేద ప్రజలు పరిస్థితులు బాలేక పోవడంతో చేసేదేమీ లేక ఆ నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు.

ప్రజల జేబుకు చిల్లు : ప్రజలు చేసేదేమీలేక తాగునీటి కోసం ప్రైవేటు ఫిల్టర్ వాటర్ పై ఆధారపడాల్సి వస్తుంది. మంచినీళ్ల కోసమే వందలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో గ్రామ ప్రజలకు జేబుకు చిల్లు పడుతుంది. సమస్యపై స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ద్వారా తమ గోడును వెళ్లబుచ్చుకున్న పరిష్కారానికి నోచుకోకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయింది. అధికారులు స్పందించి తాగునీటి సమస్య లేకుండా చేస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



హామీలే తప్ప ఆచరణ శూన్యం



- రాఘవేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అనేకమార్లు పలువురు అధికారులకు ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించాం. అధికారులు హామీలిస్తున్నారు. తప్ప ఆచరణ ఏమాత్రం చూపడం లేదు

రూ.2 లక్షలు మోటారుకు కేటాయించాం



- విద్యాసాగర్, గ్రామ సర్పంచి

గ్రామంలో ఎస్‌సి కాలనీలో ఏర్పాటుచేసిన ట్యాంకు నిర్మాణం దాదాపు పూర్తయింది. మోటారు ఏర్పాటు కోసం మండల నిధులను రూ. రెండు లక్షలు కేటాయించాం.

ఈనెల ఆఖరికి పూర్తి చేస్తాం



- రంగస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

గ్రామంలో తాగునీటి సరఫరా కోసం సొంత పైపులైన్ ఏర్పాటుకు టెండర్లు పూర్తయ్యాయి. పనులు కూడా ప్రారంభించాము. ఈనెల ఆఖరి నాటికి పనులు పూర్తి చేస్తాం. తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

-జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో బాల్య వివాహాల నిర్మూలన, వరకట్న నిషేధం అంశంపై సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో 8 వ తరగతి నుండి 10వ తరగతి లో ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి పూర్తిగా వివరించాలన్నారు. వరకట్న నిషేధ చట్టం -1961 అమలు పై చర్చిస్తూ, ఎక్కడెక్కడ కేసులు ఎక్కువగా రికార్డు అయ్యాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, కర్నూలు, ఆదోని ఆర్‌డిఒ లు అజయ్ కుమార్, సందీప్ కుమార్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, , ఐసిడిఎస్ పిడి విజయ, నాన్‌గవర్నమెంట్ ఆర్గనైజేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో పోషకాహారం అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సిడిపిఒలను ఆదేశించారు.శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన కర్నూలు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ బరువును ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, ఏదైనా సమస్య ఉంటే డాక్టర్ వద్దకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్దికెర, హాలహర్వి, మంత్రాలయం మండలాలలో పిల్లలు వయసుకు తగ్గ బరువు అంశంలో వెనుకబడి ఉన్నారన్నారు. కృష్ణగిరి, కల్లూరు, హాలహర్వి మండలాల్లో ఎత్తుకు తగ్గ బరువు అంశంలో వెనుకబడి పఉన్నారని, ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ అంశంలో మద్దికెర, ఆలూరు, కర్నూలు అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసిడిఎస్ పిడి విజయ, సిడిపిఒలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన సమాజం నిర్మించాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పరిశుభ్రమైన సమాజం నిర్మించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవరణంలో మొక్కలు నాటారు. జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత గురించి కూడా మాట్లాడుకోవడం జరుగుతుంద న్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమాజ పరిశు భ్రతను ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలన్నారు. మొదటి నుంచి పిల్లలకు అలవాట్లు నేర్పిస్తే ఖచ్చితంగా జీవితాంతం ఇలాంటి అలవాట్లు పాటిస్తారని కలెక్టర్ తల్లి తండ్రులకు సూచించారు. ప్రభుత్వ సహాయంతో టాయిలెట్స్ నిర్మిస్తున్నామన్నా రు. ఇంటి బయట చెత్త పడేయకుండా ప్రతి రోజు డోర్ టు డోర్ కలెక్షన్ కోసం వచ్చే సిబ్బందికి చెత్తను ఇవ్వాలన్నారు. జిల్లాలో అక్షరాస్యత 56 శాతం మాత్రమే ఉందన్నారు. ఇక్కడ కొంతమంది వలసలు వెళ్ళిపోతున్నారని, వలసలు వెళ్ళే సమయంలో పిల్లల్ని కూడా వారితో తీసుకొని వెళ్ళిపోతున్నారన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంట గదిని పరిశీలిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందచేయాలని కలెక్టర్ వంట సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిపిఒ భాస్కర్, ఎంపిడిఒ నాగ అనసూయ , తహశీల్దార్ విద్యాసాగర్, డిఎల్‌డిఒ రమణారెడ్డి, టిడిపి మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి గ్రామ నాయకులు విజయుడు,ఖాజామయ్య ,సర్పంచి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోషకాల లేమి..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆనందంగా ఆడిపాడాల్సిన బాల్యం పోషకాహార లోపంతో సతమతమవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తీవ్రమైన సమస్యగా కొనసాగుతోంది. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 3,55,811 మంది ఉండగా 63 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 1,79,685 మంది చిన్నారుల్లో సరైన ఎదుగుదల లేకుండా ఉన్నారు. అందులో 21,349 మంది చిన్నారులు తీవ్ర ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. 1,64,741 మంది చిన్నారులు తక్కువ బరువుతో సతమతమవుతున్నారు. 2,26,296 మంది చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారు. జిల్లాలోని గ్రామీణ, అర్బన్ పేద కుటుంబాల్లో చిన్నారుల్లో పోషకాహారం లోపం అధికంగా ఉంది. పోషకాహార లోపం కేసులు ఎక్కువగా ఆదోని, పత్తికొండ, ఆలూరు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, శ్రీశైలం, చాగలమర్రి, ఆళ్లగడ్డ, గడివేముల ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచకపోవడంతో ఈ సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 16 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 3,486 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. పిల్లల ఆరోగ్యం కోసం అన్ని రకాల చర్యలూ చేపడుతున్నట్టు కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు ఉన్నాయి. పిల్లల బరువు, ఎత్తు కొలిచే కార్యక్రమమే గ్రోత్ మానిటరింగ్ అంటారు. ప్రతి నెలా అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది అరకొరగా సాగుతోందనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. పౌష్టికాహారం అందించాలంటే తప్పనిసరిగా పేస్ యాప్‌లో నమోదు కావాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. అంగన్‌వాడీలు వినియోగిస్తున్న సెల్ ఫోన్లు నాసిరకంగా ఉంటున్నాయి. ప్రభుత్వం వారికి ఫోన్లు సరఫరా చేయడం లేదు. మరోవైపు వర్కర్లకు తీవ్ర పని భారం పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమం అరకొరగా సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులకు పోషకాహారం అందించడంలో మరింత శ్రద్ధ పెట్టి బాల్యాన్ని పుష్టివంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండెక్కిన కూరగాయలు : కార్తీక మాసం మొదలవడంతో ఎక్కువగా కూరగాయల వినియోగం ఉంటుంది. ఈ నెలలో అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులతోపాటు ఎక్కువ మంది మాంసాహారం తీసుకోరు. దీనికి తోడు గృహ ప్రవేశాలు, వివాహాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో క్యారెట్, బీన్స్, చిక్కుడు, మిరప, వంకాయ, బీర వంటి కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. వ్యాపారులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ధరలు పెట్టి విక్రయాలు సాగిస్తుండడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

ఆర్‌యు స్నాతకోత్సవం : రాయలసీమ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్నాతకోత్సవం లో 75 మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఎఎం గ్రీన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఎస్-ఎస్‌వి రామకుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ విసి వి వెంకట బసవరావు యూనివర్సిటీ నివేదికను ప్రవేశపెట్టారు. అంతకు ముందు గవర్నర్ ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఎక్యాంప్ మాంటిస్సోరి పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంత సమస్యలపై పోరాటం

పశ్చిమ ప్రాంత సమస్యల పరిష్కారానికి సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించారు. పాదయాత్రలు, జీపుజాతాలతో ప్రచారం చేశారు. ఈనెల 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు.

అవీ..ఇవీ..అన్నీ..

మైనారిటీ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో వేడుకలు జరుపుకున్నారు.






ఎల్‌వి ప్రసాద్‌కు కేక్ తినిపిస్తున్న పి.తిక్కారెడ్డి, నాగేశ్వరావుయాదవ్

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు

టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : తెలుగుదేశంపార్టీకి అంకిత భావంతో పని చేసిన ప్రతి ఒక్కరికి టిడిపిలో తగిన గుర్తింపు ఉంటుందని టిడిపి కర్నూలు పార్లమెంటు జిల్లా అధ్యక్షులు పి. తిక్కారెడ్డి అన్నారు. ఎల్‌వి.ప్రసాద్ సేవను గుర్తించి రాష్ట్ర ఉప్పర, సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా ఆయనను పార్టీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, కెడిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, పలువురు టిడిపి నాయకులతో కలిసి ఎల్‌వి ప్రసాద్‌ను శాలువాతో అభినందించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. బసప్ప, కురువ పెద్దఅమీన్, మల్లెల పుల్లారెడ్డి, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హ్యుందాయ్ వెన్యూ కారును ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు , తదితరులు

హ్యుందాయ్ వెన్యూకారు గ్రాండ్ లాంచ్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలులోని ఆటో నగర్ సమీపంలోని హ్యుందాయ్ షోరూంలో నూతన హ్యుందాయ్ వెన్యూ కారును కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు లాంచనంగా ప్రారంభించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన హ్యుందాయ్ వెన్యూ కారు ఆధునిక ఫీచర్లు, భద్రతా ప్రమాణాలు, కుటుంబ అవసరాలకు అనుగుణమైన సౌకర్యాలు కలిగి ఉందని తెలిపారు. ప్రతి వాహనం కొనుగోలు సమయంలో భద్రత, మైలేజ్, సాంకేతికతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొత్త వెన్యూ మోడల్‌ను మార్కెట్లో విస్తృత ఆదరణ పొందేలా సంస్థ నమ్మకం వ్యక్తం చేసిందన్నారు. హ్యుందాయ్ షోరూం మేనేజ్‌మెంట్ ఎండి ఎస్.వరప్రసాద్, శరన్, జీఎం శివ ప్రకాష్, రామ్ చంద్ర, రామ్ మోహన్ రెడ్డి, విగ్నేష్, రాజీవ్, నాయక్ , సిబ్బంది, కస్టమర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచితేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, టౌన్‌మోడల్ పాఠశాల విద్యార్థులతో కలిసి కొండారెడ్డి బురుజు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా కళాశాల మైదానంలో విద్యార్థులతో శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, అనంతరం ర్యాలీ ముగింపులో ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ శుభ్రత అలవాట్లు చిన్నప్పటి నుంచే పెంచుకోవాలన్నారు. చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి మంచి చర్యలతో నగరం మరింత పరిశుభ్రంగా మారుతుందని అన్నారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్‌బాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.



కొండారెడ్డి బురుజువద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

విద్యుత్ శాఖలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం 'సామూహిక ,వ్యక్తిగత పరిశుభ్రత' అంశం మీద విద్యుత్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. విద్యుత్ శాఖ లోని అన్ని ఆవరణాలను శుభ్రపరిచే కార్యక్రమం చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఇ ఆర్.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పేర కార్యాలయ ఆవరణం, పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జె. చిన్న రాఘవులు , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్ భాస్కర రావు , సర్కిల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఇ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం

మల్లెపల్లిలో స్వచ్ఛంధ్ర స్వచ్ఛ దివస్

వెల్దుర్తి : వెల్దుర్తి మండలం మల్లెపల్లి గ్రామంలో స్వచ్ఛంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపిడిఒ సుహాసినమ్మ, ఎపిఒ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వెల్దుర్తి మండలం పల్లెపల్లిలో స్వచ్ఛత కార్యక్రమం

సిఐ సతీష్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

- కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

ప్రజాశక్తి-పత్తికొండ

టిటిడి పరకామణి చోరీ కేసులో కీలక వ్యక్తి టిటిడి మాజీ ఎవిఎస్‌వి సతీష్ కుమార్ అను మానస్పద మృతి చెందారు. శనివారం పత్తికొండ పట్టణంలోని సిఐ సతీష్ కుమార్ భౌతికకాయానికి గుంటకల్ రైల్వే డిఎస్పి శ్రీనివాసచారి పూలమాలవేసి అధికార లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించారు. ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.సిఐ సతీష్ కు భార్య, కూతురు, కొడుకు తల్లిదండ్రులు ఉన్నారు. పత్తికొండ అర్బన్ సిఐ జయన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సతీష్ కుటుంబానికి అండగా ఉంటాం : శ్యామ్‌కుమార్

పత్తికొండ పట్టణానికి చెందిన సిఐ సతీష్ నీతి నిజాయితీ పరుడుగా ఉంటూ ప్రజలు మన్ననలు పొందడం గర్వంగా ఉందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ అన్నారు. మృతి చెందారని విషయం తెలిసిన వెంటనే చాలా బాధా కలిగిందన్నారు. వైసిపి శవ రాజకీయాలు చేస్తుందని ప్రజలు గమనించాలన్నారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.



సతీష్ హత్య కేసు దోషులను కఠినంగా శిక్షించాలి

పరకామని కేసు లోని నిందితులను హైకోర్టు సూచించిన ప్రకారం విజిలెన్స్ అధికారి ఇన్‌స్పెక్టర్ కుమ్మరి సతీష్ కుమార్ ఆధారాలతో కోర్టుకు సమర్పించేందుకు వెళ్లు సమయంలో హత్య చేయడం దారుణమని శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ పిబివి. సుబ్బయ్య అన్నారు. పత్తికొండ లో జరిగిన అంత్యక్రియలకు హాజరైన సుబ్బయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం పరకామని లెక్కింపులో జరిగిన తప్పులను సాక్షిగా వున్నందున నిజాయితీ గల అధికారిని చంపడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, కుటుంబాన్ని ఆర్థికంగా ఆదు కోవాలని, భార్యకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఇన్‌స్పెక్టర్‌పై ఆధారపడిన తమ్ముడి కుటుంబాన్ని ఆదుకోవాలని పిబివి.సుబ్బయ్య ప్రభుత్వానికి కోరారు. అంత్యక్రియలకు పిబివి సుబ్బయ్య, మాజీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ నాగేంద్రప్ప, సుబ్బ రాయుడు పాల్గొన్నారు.



గాల్లోకి కాల్పులు జరిపి సిఐ సతీష్‌కు లాంఛనంగా అంత్యక్రియలు



అంతిమయాత్రలో పిబివి సుబ్బయ్య నాయకత్వంలో నిరసన



అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణ రాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పుస్తకాలు, నాణేల ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పుస్తకాల ప్రదర్శన, పురాతన నాణేల ప్రదర్శన, చరిత్ర గల పుస్తకాలను అల్లూరి సత్యనారాయణ రాజు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క ఆధ్వర్యం నిర్వహించారు. ఉపాధికల్పనాధికారి పి.దీప్తి , గాడిచెర్ల ఫౌండేషన్ చైర్మన్ చంద్ర శేఖర కల్కూర, ముచ్చుకోట చంద్రశేఖర్ , రచయిత ఇనయతుల్లా, ప్రదర్శనలను తిలకించారు. ఎస్‌డివి అజీజ్ రచించిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈనాటి అతిథి ఉపాధికల్పనాధికారి పి.దీప్తిని జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్. బాష, నషీమా బీ,రేణుక, పద్మావతమ్మ, సీనియర్ అసిస్టెంట్ ఎన్.మగ్బుల్ బాష, నాగ భాస్కర్ ,ఉమ తదితరులు,విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

సి బెళగల్ : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా

సి బెళగల్ లైబ్రరీ లో ఎంపిడిఒ రాణెమ్మ శనివారం పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. లైబ్రేరియన్ వెంకటరమణ అధ్యక్షతన డిప్యూటి ఎంపిడిఒ మహేశ్వరి, కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు. పుస్తక ప్రియులకు, విద్యార్థులకు ఎంపిడిఒ విజ్ఞానబండాగారంపై అవగాహన కల్పించారు. పుస్తకాలు, పత్రికలు చదవడం అలవర్చుకోవాలని పేర్కొన్నారు.

రైతుల శ్రేయస్సే సహకార సంఘాల లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రైతుల శ్రేయస్సే సహకార సంఘాల లక్ష్యమని డివిజనల్ సహకార అధికారి చెన్నమ్మ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా శనివారం ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జెండావిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగాహాజరైన డివిజనల్ సహకార అధికారి బి చెన్నమ్మ మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల శ్రేయస్సుకు సంబంధించి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమానికి పిఐసి చైర్ పర్సన్ ఇ. వి. రమణ అధ్యక్షత వహించారు. కెడిసిసిబి బ్రాంచ్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్ డిఎల్‌సిఒ కార్యాలయ క్రెడిట్ సెక్షన్ సూపరింటెండెంట్ జయాకర్, సంఘం సిఇఒ హరీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఐసి చైర్‌పర్సన్ ఇవి.రమణ, వేదికపై చెన్నమ్మ



నూతనంగా ఎన్నికైన కమిటీ

న్యాయవాదుల హక్కుల కోసం పోరాటం

- ఐలు రాష్ట్ర అధ్యక్షులు కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

న్యాయవాదుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేసే సంఘం ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అని రాష్ట్ర అధ్యక్షులు కె.కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్‌జిఒస్ కార్యాలయంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయవాదులు వృత్తి నిర్వహణలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, న్యాయవాదులపై ఇటీవల దాడులు పెరిగాయని తెలిపారు. న్యాయవాదుల రక్షణకు రాష్ట్రంలోనూ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.చార్లెస్, అధ్యక్షులుగా పి.రషీదుల్లా, ప్రధాన కార్యదర్శిగా అడ్డాకుల తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా ఎస్.అనిల్, డి.రామ మూర్తి, జి.మల్లికార్జున, పి.అజారుద్దీన్, సహాయ కార్యదర్శులుగా ఎ.జయచంద్ర, ఇర్షాద్ అహమ్మద్, వై.మధు, కె.నబీరసూల్, కోశాధికారిగా పి.దస్తగిరి బాష, కమిటీ సభ్యులుగా తావాబ్, చెన్నయ్య, దిల్షాద్, కృష్ణ, అష్రఫ్, రామన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్వచ్ఛత వైపు గ్రామాల పయనం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని రూరల్



శ్రమదానం చేస్తున్న కృష్ణమ్మ

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం తన ప్రధాన లక్ష్యమని, స్వచ్ఛత వైపు గ్రామాలు పయనిస్తున్నాయని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కుప్పగల్లు గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కల్యాణ మండపం నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామానికి అత్యంత అవసరమైన నిర్మాణం ఇదని, త్వరలోనే ఎంపీ బస్తీపాటి నాగరాజుతో మాట్లాడి నిధుల సమీకరణకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను జెసిబి, ట్రాక్టర్ సహాయంతో కృష్ణమ్మ సేవా సైన్యం వాలంటీర్లతో కలిసి తొలగించారు. గ్రామ వీధుల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను కృష్ణమ్మ స్వయంగా పర్యవేక్షిస్తూ డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. గ్రామంలో నిర్మాణ దశలో ఆగిపోయిన సచివాలయం, రైతు సేవా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ పనిని వెంటనే పూర్తి చేయడం అత్యవసరమని, నిర్మాణం నిలిచిపోయిన కారణాలను ఎమ్మెల్యే పార్థసారథికి వివరించి, త్వరలో పనులు మళ్లీ ప్రారంభమయ్యేలా చూస్తామని తెలిపారు. గ్రామ నాయకులు నాగిరెడ్డి, మేకడోణ హనుమంతు, సూరి, తిక్క స్వామి, అంజి, రమేష్, లక్ష్మన్న, వెంకటేష్, రవి, తిరుమల, సురేష్ ఉన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఖాసీం వలీ

ప్రజాశక్తి - గోనెగండ్ల



వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మండలంలో అకాల వర్షాలు, తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ ఖాసీం వలీ డిమాండ్ చేశారు. శనివారం గోనెగండ్ల తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉల్లి, మిరప, పత్తి, వేరు శనగ, వరి పంటలకు మద్దతు ధర లేక రైతులు నష్టపోయారని, అలాగే వలసలను నివారించి ఉపాధి కల్పించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రి స్థాయిని పెంచాలి : గోనెగండ్ల ప్రభుత్వాస్పత్రిని నాయకులు సందర్శించారు. ఆస్పత్రిలో ప్రజలకు అందే వైద్య పరీక్షలను డాక్టర్ రాధాను తెలుసుకున్నారు. 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిని గతంలో ప్రభుత్వం 10 పడకలకు కుదించిందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి ఆస్పత్రి స్థాయిని పెంచాలని కోరారు. లేకపోతే ఆందోళన చేపడతామన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు షబ్బీర్ దేశాయ్, మండల అధ్యక్షులు ముల్లా ఖాసీంవలీ, షాకీర్, నాయుడు, సోమన్న పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలపై పోరాటం

- పంట కాలువల నిర్మాణం చేపట్టి సాగునీరివ్వాలి - గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని సాగునీటి సమస్యలపై పోరాటాలకు మండల రైతులు, ప్రజలు సిద్ధంగా ఉండాలని, ఈనెల 18న తెర్నేకల్ గ్రామం నుంచి దేవనకొండ వరకు బైక్ యాత్ర చేపట్టి, 19న దేవనకొండలో రైతులతో కలిసి నిరసన చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, జిల్లా నాయకులు బి.వీరశేఖర్ తెలిపారు. శనివారం తెర్నేకల్ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మహబూబ్ బాషా అధ్యక్షతన పార్టీ, ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవనకొండ మండలం చుట్టూ సాగునీటి వనరులున్నా ఇప్పటికీ సరయిన సాగునీటి సదుపాయం లేదని, ఈ నేపథ్యంలోనే వరుస కరువులు రైతులను కుంగదీస్తున్నాయని తెలిపారు. హంద్రీనీవా నుంచి రావాల్సిన 46 వేల ఎకరాలకు సాగునీరు, పంట కాలువలు లేకపోవడం, మండలంలోని కరివేముల, తెర్నేకల్, కప్పట్రాళ్ల గ్రామాల మధ్య హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పెండింగ్‌లో ఉండడంతో మండలానికి సాగునీరు సక్రమంగా రావడం లేదని పేర్కొన్నారు. పంట కాలువలు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గుండ్లకొండ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

దగ్గర స్లూయిస్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం వరకు కాలువ తీసుకురావాలని, తద్వారా మండలానికి మరో 10 వేల ఎకరాలకు సాగునీరు, చెరువులకు నీళ్లు మళ్లించే అవకాశం ఉందని తెలిపారు. పోరాటాల ద్వారానే సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈనెల 18న బైక్ యాత్ర తెర్నేకల్‌లో ప్రారంభమై, 19న దేవనకొండ తహశీల్దార్ కార్యాలయం ముట్టడి ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 20న పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు సూరి, పరమేష్, బజారి, నాయకులు పాండు, దొడ్డప్ప, రాయుడు, రవీంద్ర, లింగన్న, నాగేంద్ర, లోకయ్య, ఐసా, లక్ష్మిరెడ్డి, అనిల్ కుమార్, సుభాన్, లతీఫ్ బాష, రామాంజనేయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చుట్టూ చెత్తాచెదారం

- దుర్వాసనతో చిన్నారులు, గర్భిణుల ఇబ్బంది - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవాల్సిన పిల్లలు అధికారుల నిర్లక్ష్యం దుర్వాసనలతో ఇబ్బంది పడుతున్నారు. 4వ అంగన్వాడీ కేంద్రం పరిసరాల చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం మధ్య చదువుకోవాల్సి వస్తోంది. కేంద్రం సమీపంలో ఉన్న కాలనీవాసులు అక్కడే బహిర్భూమికి వెళ్లడం, ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయడం వల్ల విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. అంగన్వాడీ టీచర్, ఐసిడిఎస్ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పౌష్టికహారం తీసుకునేందుకు కేంద్రానికి రావాలంటే బాలింతలు, గర్భిణులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి ఉంది. అన్నం తినలేక పోతున్న పరిస్థితి ఏర్పడింది. ఐసిడిఎస్ అధికారులు పర్యవేక్షణకు వెళ్లినప్పుడు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం కనిపించలేదా, చూసిన వెంటనే పంచాయతీ అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని పలువురు చర్చించుకుంటున్నారు. కేంద్రం చుట్టూ ఇలా చెత్తాచెదారంతో నిండి పోవడం వల్ల విషసర్పాలు వచ్చే అవకాశం ఉంది. చిన్న పిల్లలు బహిర్భూమినికి, మూత్ర విసర్జనకు వెళ్లడానికి భయపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే అంగన్వాడీ కేంద్రం దుర్వాసన, పిచ్చి మొక్కలతో నిండిందని పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించి, ఎవరూ బహిర్భూమికి వెళ్లకుండా, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రం చుట్టూ పేరుకుపోయిన ముళ్లకంప, చెత్తాచెదారం

'పది'లో ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- డిఇఒ శ్యామూల్ పాల్

ప్రజాశక్తి - నందవరం

పదో తరగతి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని డిఇఒ శ్యామూల్ పాల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం నందవరం పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.



నందవరం కెజిబివి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ

జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసి ఉత్తీర్ణతశాతం పెంచాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్స్‌లో స్నాక్స్ అందజేస్తామన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుల కొరత ఉందని, అర్హత గల ఉపాధ్యాయులను పని సర్దుబాటు కింద నియమించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణమరాజు, ఉపాధ్యాయులు డిఇఒకు వినతిపత్రం ఇచ్చారు. అర్హత గల ఎస్‌జిటిలను నియమించడానికి ఎంఇఒకు ఆదేశాలు ఇస్తామని డిఇఒ తెలిపారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శేఖరప్ప, బసవరాజు, ఎల్లప్ప, నరసన్న, విరుపాక్షి, వెంకటేశ్వర్లు, మద్దయ్య, రాజశేఖర్, ధర్మన్న, రామకృష్ణ, పరమేష్, లక్ష్మికళ, కేశవయ్య, రాజేష్, హనుమంతరావు, రాజు, సాగర్, హుస్సేని, కోటేశ్వరాచారి, ఉమాపతి, సూరజ్, రాఘవేంద్ర, శాంతల పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జె.ఎల్లప్ప, జిల్లా కౌన్సిలర్ ఎ.దేవపాల్ డిఇఒకు వినతిపత్రం అందజేశారు. బదిలీ అయి రిలీవర్ లేక ఆగిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు రిలీవింగ్ సమస్యలతో ఉన్నారని, పరిష్కరించాలని కోరారు. వారు గతంలో వార్డు/గ్రామ సచివాలయంలో వివిధ హోదాలలో పని చేశారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అక్టోబర్ 3, 2025న వారు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారని చెప్పారు. ఆ విధంగానే ప్రభుత్వం కూడా నియామక పత్రం కూడా ఇచ్చిందని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కొంతమంది అధికారులు సచివాలయాల్లో పని చేసిన వారిని అక్టోబర్ 3, 2025న రిలీవ్ చేయకుండా 10న రిలీవ్ చేశారని తెలిపారు. వారు సర్వీసు, సీనియారిటీని కోల్పోతారని, వారికి 2న రిలీవింగ్ వచ్చేలా సమస్యను పరిష్కరించాలని కోరారు.



డిఇఒకు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

'గాయత్రి'లో అక్రమ వసూళ్లు

- కళాశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - ఆదోని



ఫీజుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన గాయత్రి ఐటిఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శశిధర్ కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేసి విద్యార్థులకు సరైన తరగతులు నిర్వహించ కుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. తరగతుల నిర్వహణకు అధ్యాపకులు కూడా కళాశాలలో లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నా ఉన్నతాధికారు లు చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, అక్రమ వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్



బనవాసి జవహర్ నవోదయ విద్యాలయలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడారు. పూర్వ విద్యార్థులు పాల్గొని స్ఫూర్తిదాయకమైన అనుభవాలను విద్యార్థులతో పంచుకోవాలని కోరారు.

అవసరాల నిమిత్తం ఇసుక తీసుకోవచ్చు

- జెసిబిలు పెడితే చర్యలు
- జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారి రవిచంద్ర

ప్రజాశక్తి- దేవనకొండ


అవసరాల నిమిత్తం ఇసుకను తీసుకోవచ్చని జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారి రవిచంద్ర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. తెర్నేకల్ గ్రామంలో హంద్రీ వాగులో ఇసుక అక్రమ తరలింపుపై మండల రెవెన్యూ శాఖతో గనులు, భూగర్భ వనరుల సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. హంద్రీ వాగులో తెర్నేకల్ గ్రామస్తుల అవసరాల నిమిత్తం ఇసుకను తీసుకోవచ్చని, జెసిబిల ద్వారా టిప్పర్లు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హంద్రీవాగులో నీటి ప్రవాహం ఉన్నందున టిప్పర్లు, జెసిబిలు వెళ్లే అవకాశం లేదన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి-ఆలూరు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, ఎంపిడిఒ మద్దిలేటి స్వామి తెలిపారు. శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పట్టణ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ... బహిరంగ మలమూత్ర విసర్జన చేయడం వల్ల కలిగే నష్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. **ఎమ్మిగనూరులో** మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర' నిర్వహించారు. విద్యార్థులకు, సిబ్బందికి, పట్టణ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. **దేవనకొండ** గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రఫీ ఆధ్వర్యంలో సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఎంపిడిఒ జ్యోతి, వైద్యాధికారి కల్యాణ్ పాల్గొన్నా రు. జిల్లేడుబుడకల గ్రామంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, నేలతలమర్రి గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సర్పంచి పద్మజ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్, ఏపీవో రాజు నాయక్ పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కె.రమాదేవి, డిప్యూటీ ఎంపిడిఒ మల్లికార్జున, ఎంఇఒ రాఘన్న, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, పీడీ రవీంద్ర పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలం అల్వాల గ్రామంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఎంపిడిఒ మణిమంజరి, డిప్యూటీ ఎంపిడిఒ అనంతశయన, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ వహీద్, ఏపీవో మహమ్మద్ బాష పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని నేమకల్లు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు సమక్షంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. టిడిపి నాయకులు సంగాల చంద్ర, తలారి సుంకన్న, రఘునాథ పాల్గొన్నారు.



ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు



ఎమ్మిగనూరులో



చిప్పగిరిలో...

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల

ప్రజాశక్తి- ఆలూరు

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల కోరారు. శనివారం ఆలూరులోని జ్యోతిబసు భవనంలో రత్నమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ వల్ల అనేకమంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మైక్రో ఫైనాన్స్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్నపు వేధింపులను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆడపిల్లలు ఒంటరిగా వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉందని తెలిపారు. ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు షేకున్ బీ, రాధమ్మ, మండల కమిటీ సభ్యులు విజయలక్ష్మి, గౌసియా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామల

కౌలుట్ల ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు దంపతులు శనివారం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణలతో విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు.

ఇమామ్‌లు, మౌజన్ల వేతనాల విడుదలపై హర్షం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లు, మౌజన్ల వేతనాల విడుదలపై టిడిపి ముస్లిం, మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడారు. ముస్లిం, మైనారిటీల సంక్షేమం టిడిపితోనే సాధ్యమని తెలిపారు. టిడిపి మైనార్టీ నాయకులు మహల్ రహమతుల్లా, బేతాళ బడేసాహెబ్, నజీర్ సాబ్, మదీన, మిన్నెల్లా, నూర, కొత్తింటి ఫక్రుద్దీన్, పిసారి నూర, అక్బర్ వలీ, పాముల అజీజ్, ఖాసీం వలీ, షఫీ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండలో పుస్తక ప్రదర్శన

గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా దేవనకొండ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో డిప్యూటీ ఎంపిడిఒ గోపాల్, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, గ్రంథాలయ సహాయకులు శ్రీనివాసులు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు పుస్తక పఠనంతోనే అభివృద్ధి చెందుతారని సూచించారు. **కౌతాళం**లోని గ్రంథాలయంలో పాఠ్య పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మధులీనా మాట్లాడుతూ... గ్రంథాలయం ఒక విజ్ఞాన భాండాగారమని తెలిపారు. ఎంతో విజ్ఞానాన్ని అందించే కథలు, నవలలు, విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు ఉన్నాయన్నారు. ఈ పుస్తకాల పఠనం ద్వారా మేధస్సు పెంచుకోవచ్చన తెలిపారు.



కౌతాళంలో

రైతులకు కూటమి అండ

- డిసి ప్రెసిడెంట్ కిష్టప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి




మాట్లాడుతున్న డిసి ప్రెసిడెంట్ కిష్టప్ప

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని డిసి ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏబీసీ కాలువ కింద పంటలు సాగు చేసిన రైతులందరికీ సకాలంలో సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు హెచ్‌ఎన్ఎస్ కాలువ నుంచి అర్ధగేరి వరకు సాగునీరు విడుదల చేశామని తెలిపారు. ఆయకట్టు రైతులెవరూ అధైర్యపడవద్దని, రైతులకు వెన్నుదన్నుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉంటారని చెప్పారు. ముళకంపతో నిండిన కాలువలకు కూటమి ప్రభుత్వం వచ్చాక అధిక నిధులు వెచ్చించి తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతులకు ఇరిగేషన్ అధికారులు సహకారం అందించాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. డైరెక్టర్లు దానప్ప, రామాంజిని, జెఇలు శ్రీధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

మాదకద్రవ్యాల వాడకం ఆరోగ్యానికి హానికరమని, వాటి జోలికి పోకూడదని షాస నర్సింగ్ హోమ్ చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం ఆదోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కిరణ్ కుమార్, గైనిక్ డాక్టర్ రేష్మ హాజరయ్యారు. పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎజిఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ... తల్లిదండ్రుల ప్రతిరూపాలు చిన్నారులని, వారికి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు .

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సంతకాల సేకరణ చేపడుతున్న వైసిపి నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శనివారం పట్టణంలోని 11వ వార్డులో మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... పేదలకు వైద్యం అందాలంటే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని తెలిపారు. వైసిపి మైనార్టీ పట్టణ అధ్యక్షులు ముల్లా రసూల్, 11వ వార్డు అధ్యక్షులు జగన్ రఫీ, బూత్ లెవెల్ ఏజెంట్ ఫరూక్, వార్డు నాయకులు వడ్డే గుండరాజ్, బాష, వలీ, వడ్డే రవి, షరీఫ్, దివాన్ సైఫుల్లా, మహబూబ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత అవసరం

డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్. భాస్కర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత అవసరమని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది ర్యాలీ , మానవహారంగా ఏర్పడి ప్రమాణం చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత , పరిసరాల పరిశుభ్రత పై నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సమాజంలో అందరిలో మార్పు తీసుకుని రావాలన్నారు. రోజుకు రెండుసార్లు స్నానం చేయడం, మలమూత్ర విసర్జన తరువాత భోజనానికి ముందు సబ్బుతో చేతులు కడుక్కోవడం, తరచుగా చేతులు కడుక్కోవడం శాస్త్రీయ పద్ధతిలో చేతులు కడుక్కోవడం ప్రోత్సహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, సానిటరీ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడటం ప్రోత్సహించాలన్నారు. గ్రామాలలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఎఒ అరుణ,డిస్టిక్ కో ఆర్డినేటర్ బ్లైండ్ నెస్ కంట్రోల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిమబిందు, డాక్టర్ రఘు, డెమో ప్రకాష్ రాజు , హెచ్ఇఒ బాబా ఫక్రుద్దీన్ , డి వ్యాట్ హెచ్ ఇఒ పద్మావతి, ఎస్ఒ హేమ సుందర్, డిపిహెచ్ఎన్ఒ అన్నపూర్ణ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

జిజిహెచ్ లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం.

కర్నూలు

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో పెయిన్ బ్లాక్ వద్ద చెట్లు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఒక చెట్టు నాటి మన భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయరాదని ప్రజలకు తెలియజేశారు. ఇది రోగాల వ్యాప్తికి ప్రధాన కారణమవుతుందని, అందరూ సమీపంలోని శుచి మందిరాలను వినియో గించాలని సూచించారు. ఆసు పత్రులలో బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ చాలా కీలకమన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఒక్కరు నియమాలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరిండెంట్, సావిత్రిబాయి, నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం

కోడుమూరు : పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని ఎంపిడిఒ ఎసి రాముడు అన్నారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముడుమలగుర్తి గ్రామాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రత ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాల పర్యవేక్షణ ప్రజలతో, పాఠశాల పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రత అంశాల మీద పిల్లలకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆదర్శ పాఠశాల నందు పిల్లలతో చేతులు శుభ్రం చేసుకునే విధానంపై సంబంధిత ఆరోగ్య శాఖ సిబ్బందితో అవగాహన కల్పించారు. గ్రామంలోని మూడు అంగన్వాడి సెంటర్స్‌ను కూడా సందర్శించారు. అంగన్వాడి సెంటర్లలో పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత మీద పరిసరాల పరిశుభ్రత మీద పర్యవేక్షణ చేసి సూచనలు చేశారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అంశము ఆవాస్ ప్లస్ సర్వేలో వేగవంతంగా అర్హత వారిని నయమోదు చేయించాలని సబంధిత అధికారులను ఆదేశించారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డుఅవసరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కార్మిక కోడ్లను రద్దు చెయ్యాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు హమాలి ఫెడరేషన్ ఓల్డ్ సిటీ కమిటీ సమావేశం సిఐటియు నగర నాయకులు రాంబాబు అధ్యక్షతన సుర్జిత్ భవన్‌లో నిర్వహించారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ్, హమాలి ఫెడరేషన్ కన్వీనర్ నాగస్వాములు మాట్లాడుతూ చాలామంది నిరుద్యోగులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేనందున కుటుంబ పోషణ కోసం లోడింగ్ అన్లోడింగ్ బరువైన మూటలను ఎత్తి దించుతూ బతికీడుస్తున్నారని అన్నారు. చాలా ప్రభుత్వ ప్రైవేటు గోదాములలో సరుకులు ఎత్తుతూ దించుతున్న సందర్భంలో కార్మికులకు కాళ్ల, చేతులు ఇరగడం, వెన్నెముక సమస్యలు వస్తున్నా గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇంత బరువైన పనులు చేసి బతకవలసి వస్తుందని బాధను వ్యక్తం చేశారు. అధికారం కోసం అనేక వాగ్దానాలు ఇచ్చిన పాలకులు అమలు చేయనందున హమాలీలు మోసపోతున్నారని విమర్శించారు. తరాలుగా ముఠా కార్మికులుగా పనిచేస్తున్న వారి తలరాతలు మారక పోవడం, కార్మికులకు ఆసరగా నిలవవలసిన ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికచట్టాలు అమలుచేసి అసంఘటిత కార్మికలకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు సోలామన్‌రాజు, షేక్ష, బజారి, మాసూం, మద్దిలేటి, విశ్వనాథం, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, ప్రకాష్, శ్రీను , యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయరామాంజనేయులు

మైనర్ డ్రైవింగ్ చట్ట ప్రకారం నేరం

జనవరి నుండి అక్టోబర్ వరకు 675 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు

-ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడం వలన తెలిసి తెలియని డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ శనివారం తెలిపారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమేనని, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు, వాహనాల యజమానులకు సూచించారు. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే కుటుంబం జీవితాంతం బాధపడవలసి వస్తుందని, పిల్లలను రోడ్డు ప్రమాదం ద్వారా దూరం చేసుకోవడం కుటుంబ సభ్యులకు తల్లిదండ్రులకు తీరని లోటని అన్నారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు గురించి జిల్లాలో పలు ప్రదేశాలలో, పాఠశాలల్లో , కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవేర్ నెస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని ఎస్పి తెలిపారు. మితిమీరిన వేగంతో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, సైలెన్సర్లు తీసి ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేసి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించినా చట్టప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి ప్రమాదాలను అరికట్టి, ప్రజలందరూ సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరాలని , ప్రజలందరూ జిల్లా పోలీసులకు సహకరించాలన్నారు. 2025 జనవరి నుండి అక్టోబర్ వరకు 675 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి ఆపి మొదటి తప్పిదంగా వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి వదిలేస్తున్నామన్నారు. రెండవ సారి నడుపుతూ పట్టుబడితే రూ. 5 వేల జరిమానా విధిస్తామన్నారు. మైనర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే ఆ వాహన యజమానులు లేదా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడంతో పాటు , వాహనాలు సీజ్ చేస్తామని ఎస్పి హెచ్చరించారు





పత్తిఓబులయ్యను సన్మానిస్తున్న ఎంపీ టిజి. వెంకటేశ్ , తదితరులు

కళా రంగంలో మణి మకుటం పత్తి ఓబులయ్య

మాజీ ఎంపీ టిజి. వెంకటేశ్

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్: కళారంగానికి పత్తి ఓబులయ్య చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం రాత్రి ఆయన గృహంలో ఇటీవల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నుండి లైఫ్ టైం అచీవ్‌మెంట్ పొందిన పత్తి ఓబులయ్యను ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో టీజీవి కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి యాగంటీశ్వరప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు రైతులతో నెలాఖరులోగా ఒప్పందం

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పొగాకును సాగుచేసిన రైతులతో ఈ నెల ఆఖరిలోగా ఒప్పందం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పొగాకు కంపెనీలను ఆదేశించారు. శనివారం జిల్లాలో పొగాకుకు సంబంధించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైట్ బర్లీ రకం పొగాకు పంట సాగుపై నియంత్రణ అమలులో ఉందన్నారు. రైతులు , పొగాకు కంపెనీలు తప్పనిసరిగా 100శాతం బైబ్యాక్ ఒప్పందం కలిగిన అధికారిక ఒప్పందం లేదా చట్టబద్ధమైన ఎంఒయు కుదుర్చుకోవాలని తెలిపారు. పొగాకు సంబంధించిన టాస్క్ ఫోర్స్ కమిటీలు డివిజన్, మండల స్థాయిలో కూడా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పి (అడ్మిన్) హుస్సేన్ పీరా, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డిఎంహెచ్ ఒ డాక్టర్ భాస్కర్ రాజు, సహాయ వ్యవసాయ సంచాలకులు, పొగాకు కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మై పర్‌లో 25వ బ్యాచ్‌కు ఇండక్షన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఏ క్యాంపు నందు మైపర్ ఫార్మసీ కళాశాలలో 25వ బ్యాచ్ బీఫార్మసీ , ఫార్మా డీ విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ వి.నాగ ప్రసాద్ నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఫార్మసీ విద్య గొప్పతనాన్ని , భవిష్యత్తులో ఎలా చదువుకోవాలి, ఏ విధంగా ఉద్యోగులు కావాలి అనే విషయం మీద అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సతీష్ , కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర ఎన్.స్టెల్లా సతీష్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాజకుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ స్పోర్ట్స్‌లో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్ కండక్ట్ చేసి బహుమతులు ఇచ్చారు.



స్టాంటన్‌పురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ఆరో రోజు అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కెవిఆర్ గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజీ కర్నూలు తరపున ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.రేష్మా ఆధ్వర్యంలో స్టాంటన్‌పురం గ్రామంలో ప్రత్యేక శిబిరం ఆరోరోజు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి 'స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణ ఆంధ్రా' ప్రతిజ్ఞ చేయించి పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై బాధ్యతను గుర్తుచేశారు. అనంతరం 'మనవహారం' ద్వారా గ్రామ ప్రజలతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. తరువాత సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా భద్రత, మహిళల భద్రత, బాలికరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.కర్నూలు ఎఎస్ఐ విజయ కిరణ్ ఆన్‌లైన్ భద్రత, వ్యక్తిగత సమాచారం రక్షణ, అత్యవసర హెల్ప్‌లైన్‌లు, మహిళల రక్షణ చట్టాలపై సూచనలు చేశారు. డాక్టర్ పి. మౌనిక, మెడికల్ ఆఫీసర్ సైబర్ బుల్లీయింగ్ ప్రభావాలు, మానసిక భద్రత, అమ్మాయిల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎస్. అఫ్రోసా సుల్తానా, హిమాబిందు, ఎం.దేవిక, వై.సుమలత (జూనియర్ లెక్చరర్లు) పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు చురుకుగా పాల్గొన్నారు.